సాక్షి
వికారాబాద్
శుక్రవారం । 18 । ఏప్రిల్ । 2025



వైభవంగా పల్లకీ సేవ

తాండూరులోని శ్రీ భావిగి భద్రేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారి పల్లకీ సేవ నిర్వహించారు. 12లో▸



వామ్మో.. మురుగు!

దుద్యాల్ పదోవార్డులో ఇళ్ల మధ్య మురుగు చేరి దుర్వాసన వస్తోందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 12లో▸



కాలనీలో తాగునీటి ఎద్దడి

అసలే వేసవి కాలం. తాగునీరు సక్రమంగా సరఫరా కాక పిట్లం కాలనీ వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 13లో▸

గాలివాన బీభత్సం



ధారూరు: నాగసముందర్‌లో కురుస్తున్న భారీవర్షం

జిల్లాలోని పలు మండలాల్లో గురువారం గాలివాన బీభత్సం సృష్టించింది. సాయంత్రం ఒక్కసారిగా గాలిదుమారం తోపాట భారీ వర్షం పడింది. పలుచోట్ల వడగండ్ల వాన కురిసింది. దీంతో చేతికొచ్చిన పంటలు దెబ్బతిన్నాయి. వికారాబాద్, తాండూరు, పెద్దేముల్, ధారూరు, బంట్వారం, దుద్యాల్ మండలాల్లో గాలి తీవ్రతకు చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ప్రస్తుతం వరి పంట కోత దశలో ఉండటంతో నష్టం వాటిల్లింది. మొక్కజొన్న, పసుపు, జొన్న, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. విద్యుత్ స్తంభాలు, వైర్లు పడిపోవడంతో పలు గ్రామాల్లో కరెంట్ సరఫరా నిలిచిపోయింది.అనంతగిరి పల్లి సమీపంలో భారీ వృక్షం రోడ్డుపై పడింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. బొంరాస్‌పేట మండలం మైసమ్మగడ్డ తండాలో పిడుగుపాటుకు 20 గొర్రెలు మృతి చెందాయి. దాదాపు రూ.2లక్షల నష్టం వాటిల్లిందని బాధిత రైతు పీక్యానాయక్ తెలిపాడు.

– వికారాబాద్



బొంరాస్‌పేట: మైసమ్మగడ్డ తండాలో పిడుగుపాటుకు మృతి చెందిన గొర్రెలు



బంట్వారం: ఓగులాపూర్ గేటు వద్ద రోడ్డుపై విరిగి పడిన చెట్టు



తాండూరు రూరల్: మారేపల్లి తండాలో కురిసిన వడగండ్ల వాన



పెద్దేముల్ మండలం కొండాపూర్‌లో రోడ్డుపై పడిన ఇంటి పైకప్పు రేకులు

న్యూస్‌రీల్

కృత్రిమ మేధతో మెరుగైన విద్య

జిల్లా విద్యాధికారి రేణుకాదేవి



దాదాపూర్‌లో స్కూల్ యూనిఫాం కుట్టు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈఓ రేణుకాదేవి

దోమ: కృత్రిమ మేధతో విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి అన్నారు. గురువారం మండలంలోని గుండాల్, దాదాపూర పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకుని విద్యార్థులకు ఏఐ విద్య నేర్పించాలని సూచించారు. ఏఐ విధానంలో బోధన చేస్తే తొందరగా అర్థమవుతుందన్నారు. అనంతరం స్కూల్ యూనిఫాం కుట్టు కేంద్రాన్ని పరిశీలించారు. విద్యార్థుల కొలతలు తీసుకున్న తరువాతే యూనిఫాం కుట్టాలని సూచించారు. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకటయ్య, ప్రధానోపాధ్యాయుడు అమర్‌నాథ్, ఉపాధ్యాయులు, సిబ్బంది మల్లారెడ్డి, వెంకట్‌రెడ్డి, రఘుసింగ్ తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా టెన్త్ ఫలితాలు

ముగిసిన పేపర్ వాల్యూయేషన్ ప్రక్రియ

సాక్షి, రంగారెడ్డిజిల్లా: పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియ ముగిసింది. మార్కుల జాబితాను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ మొదలు పెట్టారు. నెలాఖరులోగా ఫలితాలు వెల్లడించే అవకాశం ఉన్నట్లు జిల్లా విద్యాశాఖ స్పష్టం చేసింది. జవాబు పత్రాల మూల్యాంకనంలో 1,100 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కేవలం పది రోజుల వ్యవధిలోనే సుమారు రెండు లక్షల జవాబు పత్రాలను దిద్ది రికార్డు సృష్టించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి లోటుపాట్లకు ఆస్కారం ఇవ్వలేదని ఆ శాఖ ప్రకటించింది. సబ్జెక్టుల వారీగా విద్యార్థుల మార్కుల జాబితాను ఆన్‌లైన్‌లో పొందుపరిచే ప్రక్రియ పూర్తయిన వెంటనే ఫలితాలను వెల్లడించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఇదిలా ఉంటే ఆరు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలు గురువారంతో ముగిశాయి. శనివారం నుంచి ఆయా పాఠశాలలు విద్యార్థులకు సెలవులు ప్రకటించాయి. అయితే ఆయా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయులు మాత్రం ఈ నెల 24 వరకు హాజరు కానున్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు



ఫర్టిలైజర్ షాపులో స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న నర్సింహారావు

ఆమనగల్లు: ఎరువుల డీలర్లు, ఫర్టిలైజర్ షాపుల డీలర్లు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా విక్రయాలు చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి బి.నర్సింహారావు అన్నారు. నిబంధనలు పాటించని వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఆమనగల్లు పట్టణంలోని పలు ఫర్టిలైజర్ షాపులను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాకు రిజిస్టర్లు, బిల్ బుక్స్, స్టాక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే సీజన్‌కు రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. ఆయా మండలాలకు అవసరమైన ఎరువులు, విత్తనాలను ముందుగా తెచ్చుకోవాలని, సీజన్ ప్రారంభం నాటికి విక్రయానికి సిద్ధంగా ఉంచాలని సూచించారు. నకిలీ ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. స్టాక్ రిజిస్టర్లలో ఎప్పటికప్పుడు వివరాలు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలు పక్కాగా జరగాలి

యాచారం: ఈజీఎస్ సామాజిక తనిఖీల కార్యక్రమం పక్కాగా జరగాలని జిల్లా విజిలెన్స్ అధికారి కొండయ్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఏడాది పాటు జరిగిన ఉపాధి పనులకు సంబంధించి తనిఖీల సిబ్బందికి రికార్డులు అందజేయాలని సూచించారు. కూలీలతో కలిసి పనులు చూపించాలని, పనుల్లో అవకతవకలు, అక్రమాలు జరిగితే బాధ్యులైన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

- పరిగి, పూడూరులో అవగాహన సదస్సులు
- హాజరైన స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి



పరిగి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సందర్శకుల గదిని ప్రారంభిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

పరిగి/పూడూరు: రైతు సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం పరిగి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సందర్శకుల కోసం నిర్మించిన గదిని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూ భారతి చట్టంతో రైతు భూ సమస్యలన్నీ పరిష్కారమవుతాయన్నారు. గత ప్రభుత్వం తెచ్చిన ధరణితో రైతులు నానా ఇబ్బందులు పడ్డారని తెలిపారు. రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ముందుగా పైలెట్ మండలాల్లో.. ఆ తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా భూ భారతి కార్యక్రమాన్ని అమలు చేస్తామన్నారు. భూ సమస్యలు ఉన్న రైతులు రెవెన్యూ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. తహసీల్దార్ కార్యాలయానికి నూతన భవనం నిర్మించాలని ఎమ్మెల్యే.. మంత్రిని కోరారు. స్పందించిన ఆయన నూతన భవన నిర్మాణానికి నివేదికలు పంపాలని కలెక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి

గత ప్రభుత్వం ధరణి చట్టం తెచ్చి సామాన్య ప్రజలు, రైతులను ఇబ్బందులకు గురి చేసిందని, పైసలిస్తే రాత్రికి రాత్రే రైతుల పట్టాలు మార్చిడి చేశారని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి ఆరోపించారు. గురువారం మండల కేంద్రమైన పూడూరులో భూ భారతి చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ధరణికి వ్యతిరేకంగా పోరాటం చేశామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ధరణిని రద్దు చేసి రైతులకు న్యాయం చేశామన్నారు. భూ భారతి ద్వారా కొత్త ఆర్ఓఆర్ చట్టాన్ని తీసుకొచ్చి భూ సమస్యలను సులభతరంగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి భూ సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ భూ భారతి చట్టం విధి విధానాలను రైతులకు తెలియజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ మాట్లాడుతూ.. గతంలో స్లాట్ బుక్ అయితే రిజిస్ట్రేషన్ జరిగేవని.. దీంతో అసలు లబ్ధిదారులకు నష్టం జరిగేదన్నారు. కొత్త చట్టం ప్రకారం భూమి రిజిస్ట్రేషన్ కావాలంటే తప్పనిసరిగా సర్వే రిపోర్ట్ అప్‌లోడ్ చేస్తేనే రిజిస్ట్రేషన్ అయ్యి కొత్త పట్టాదారు పాసు పుస్తకం వస్తుందన్నారు. వారసత్వం కోసం దరఖాస్తు చేసుకుంటే 30 రోజుల్లో ప్రక్రియ పూర్తవుతుందన్నారు. తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ స్థాయిలో సమస్య పరిష్కారం కాకుంటే ల్యాండ్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేసి పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, ఎస్పీ నారాయణరెడ్డి, ఆర్డీఓ వాసుచంద్ర, తహసీల్దార్లు భరత్ గౌడ్, లక్ష్మీనారాయణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

లగచర్ల రైతులకు చెక్కులు

- 45 మందికి రూ.17.89 కోట్ల విలువైన చెక్కుల పంపిణీ
- సబ్ కలెక్టర్ చేతులమీదుగా నిర్వాసితులకు అందజేత



లగచర్ల రైతులకు చెక్కులు పంపిణీ చేస్తున్న సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్

దుద్యాల్: పారిశ్రామిక వాడ ఏర్పాటులో భూములు కోల్పోతున్న లచగర్ల రైతులకు తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ గురువారం చెక్కులు పంపిణీ చేశారు. 45 మందికి సంబంధించిన 89.19 ఎకరాల పట్టా భూములకు చెందిన రూ.17 కోట్ల 89 లక్షల 50 వేల విలువైన చెక్కులను నిర్వాసితులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ అభివృద్ధికి సహకరించాలని కోరారు. చాలా మంది రైతులు పారిశ్రామిక వాడ ఏర్పాటు కోసం భూములు ఇవ్వడానికి ముందుకు వస్తున్నారన్నారు. పరిహారం విషయంలో రైతులు ఎలాంటి అపోహలను నమ్మవద్దని, ప్రభుత్వం అందరికీ సమానంగా ఇస్తోందని తెలిపారు. మిగిలిన రైతులు కూడా భూములు అప్పగించి, పరిహారం పొందాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో దుద్యాల్ తహసీల్దార్ కిషన్, రెవెన్యూ అధికారులు, లగచర్ల గ్రామానికి చెందిన పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

తుక్కుగూడ: ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోకి వచ్చే చిన్నారులకు ప్రభుత్వాలు పంపిణీ చేసే పౌష్టికాహారం అందించాలని కేంద్ర మహిళ సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీలు డాక్టర్ ప్రీతం, యశ్వంత్ అన్నారు. పురపాలక కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అనిత రామచంద్రన్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో చిన్నారుల వ్యక్తిగత వివరాలు, అందుతున్న పౌష్టికాహార వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆట పాటలతో చిత్రాలను ఉపయోగించి చిన్నారులకు బోధన చేయాలని, పిల్లల మేధో వికాసం పెంపొందించే విధంగా బోధన ఉండాలన్నారు. వారి మానసిక, శారీరక ఎదుగుదలను ఎప్పటికప్పుడు గుర్తించాలని సూచించారు.

పైకప్పే.. ముప్పే

తరచూ పెచ్చులూడుతున్న పాఠశాలల స్లాబులు

- గాయపడుతున్న విద్యార్థులు
- గతంలో దుద్యాల్.. తాజాగా ధారూరు మండలంలో ఘటనలు
- ఆందోళనలో విద్యార్థులు, తల్లిండ్రులు

వికారాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు, సిబ్బంది భద్రతకు రక్షణ కరువైంది. స్కూల్ భవనాలకు లక్షలాది రూపాయలు ఖర్చు చేసి మరమ్మతులు చేపడుతున్నా తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మూడు నెలల క్రితం దుద్యాల్ మండలం హస్నాబాద్ ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల భవనం పైకప్పు పెచ్చులూడి పడి విద్యార్థులు పరుగులు తీసిన ఘటన మరువక ముందే బుధవారం ధారూరు మండలం మున్నూరు సోమారం పాఠశాల పైకప్పు పెచ్చులూడి పడి విద్యార్థినికి గాయాలు కావడం కలకలం రేపింది. గత, ప్రస్తుత ప్రభుత్వాలు పాఠశాలల అభివృద్ధి కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేశాయి. అయితే పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదనే విమర్శలు ఉన్నాయి. బీఆర్‌ఎస్ హయాంలో మన ఊరు – మన బడి పేరుతో పాఠశాలలను అభివృద్ధి చేయగా.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మా ఆదర్శ పాఠశాలల పేరుతో భారీగా నిధులు ఖర్చు చేసింది. కానీ పర్యవేక్షణ సరిగ్గా లేకపోవడంతో ఇష్టారాజ్యంగా పనులు చేశారనే విమర్శలు ఉన్నాయి.

అన్ని పాఠశాలల్లో పూర్తయిన పనులు

జిల్లాలో మొత్తం 1,062 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. మన ఊరు – మనబడి కార్యక్రమం కింద గత ప్రభుత్వం మొదటి విడతలో 371 పాఠశాలలను ఎంపిక చేసింది. 46 పాఠశాలల్లో పనులు పూర్తి కాగా 92 స్కూళ్లలో పనులు మధ్యలో ఆగిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అమ్మా ఆదర్శ పాఠశాలల పేరిట ఒకే విడతలో 924 స్కూళ్లలో అభివృద్ధి పనులు చేపట్టారు. ఇందుకోసం రూ.35.5 కోట్లు ఖర్చు చేశారు. ప్రస్తుతం అన్ని పాఠశాలల్లో మరమ్మతు పనులు పూర్తయ్యాయి.

ఆందోళనలో తల్లిదండ్రులు

ప్రభుత్వ పాఠశాలల్లో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటుండంతో విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.



మరీ ఇంత నిర్లక్ష్యమా?

హస్నాబాద్ ప్రాథమిక పాఠశాల తరగతి గదిలో పెచ్చులూడి పడిన పైకప్పు (ఫైల్)

దుద్యాల్: మండలంలోని హస్నాబాద్ హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలో ప్రమాదం జరిగి మూడు నెలలు దాటినా దిద్దుబాటు చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.. అప్పట్లో క్లాసులు జరుగుతున్న సమయంలో పాఠశాల భవనం పైకప్పు పెచ్చులూడి పడ్డాయి.. విద్యార్థులు, ఉపాధ్యాయులు భయంతో బయటికి పరుగులు తీసిన విషయం తెలిసిందే.. ప్రమాదం జరిగిన సమయంలో ఉపాధ్యాయురాలు కీర్తి, 41 మంది విద్యార్థులు ఉన్నారు. అదృష్టవశాత్తు ఎవరికీ ఎలాంటి ముప్పు జరగలేదు.. ఈ ఘటనకు సంబంధించిన వార్తలు పత్రికల్లో రావడంతో హుటాహుటిన అధికారులు పాఠశాలను సందర్శించి మరమ్మతు పనులు చేపడతామని హామీ ఇచ్చారు. మూడు నెలలు దాటినా కనీస మరమ్మతులు కూడా చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది.పిల్లల ప్రాణాలంటే లెక్కలేదా అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. విద్యార్థులకు ఏమైనా జరిగితే అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

పునరావృతం కావొద్దు



ప్రభుత్వ పాఠశాలల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎప్పుడు ఎలాంటి వార్త వినాల్సి వస్తుందోనని భయంగా ఉంది. శిథిలావస్థకు చేరిన భవనాలను కూల్చివేసి కొత్త వాటిని నిర్మించాలి.

– మేకల భిక్షపతి, విద్యార్థి తండ్రి, మున్నూరుసోమారం

నాసిరకంగా పనులు



పాఠశాల భవనాలు నిర్మించే సమయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదు. చిన్నపాటి వర్షాలకే పైకప్పుల నుంచి నీరు కారుతోంది. మరమ్మతులు చేపట్టిన కొన్ని నెలలకే భవనాలు దెబ్బతింటున్నాయి.

– బిల్లపాటి యాదయ్య, విద్యార్థిని తండ్రి, ధారూరు


భయంగా పాఠశాలకు..



పాఠశాలకు రావాలంటే భయంగా ఉంది. తరగతి గదులు శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందో తెలియడం లేదు. అధికారులు పాఠశాలను పరిశీలించి వెళ్తున్నారే తప్ప మరమ్మతు పనులు చేయడం లేదు. వెంటనే స్కూను బాగు చేయాలి.

– అవంతిక, 3వ తరగతి, హస్నాబాద్

అధికారులకు విన్నవించినా..



పాఠశాల దెబ్బతిన్న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. విద్యార్థుల ప్రాణాలంటే ఎవరికీ లెక్కలేదు.. నాలుగు నెలల క్రితం పాఠశాల భవనం పెచ్చులూడినా నేటికీ మరమ్మతులు చేయకపోవడం దారుణం. కొత్త భవనం నిర్మించాలి.

– కొండ అశోక్, కాలనీ వాసి

గుండె ఆగినంత పనైంది



పాఠశాల తరగతి గదులు శిథిలావస్థకు చేరాయి. తరచూ పైకప్పు పెచ్చులూడి పడుతున్నాయి.గత ఏడాది డిసెంబర్ మాసంలో పాఠాలు చెబుతుండగా ఒక్క సారిగా పైకప్పు పెచ్చులూడి పడ్డాయి.గుండె ఆగిపోయినంత పనైంది.

– కీర్తి, పాఠశాల హెచ్ఎం

క్లుప్తంగా

తాటిచెట్టుపై నుంచి పడి..

వ్యక్తికి గాయాలు



లక్ష్మయ్య

కుల్కచర్ల: తాటిచెట్టుపై నుంచి పడి వ్యక్తికి గాయాలైన ఘటన కులకచర్ల మండల పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. కుల్కచర్ల మండలం అంతారం గ్రామానికి చెందిన విఠల్ లక్ష్మయ్య గురువారం ఉదయం తాటిముంజలు కోయడానికి తాటిచెట్టు ఎక్కాడు. తాటిముంజలు కోసిన అనంతరం క్రిందికి దిగుతున్న క్రమంలో కాలుజారి క్రిందపడినట్లు స్థానికులు, బాధితుడు వివరించారు. విషయం తెలుసుకున్న స్థానికులు వెంటనే 108కు సమాచారం చేరవేశారు. అతడిని మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు రెండు చేతులకు మణికట్టు వద్ద ఎముకలు విరిగినట్లు వారు ధ్రువీకరించారు.

దుకాణ సముదాయంలో సెల్‌ఫోన్ చోరీ



సీసీ పుటేజీలో రికార్డయిన సెల్‌ఫోన్ దొంగిలించిన వ్యక్తి

కుల్కచర్ల: దుకాణ సముదాయంలో సెల్‌ఫోన్ చోరీ చేసిన ఘటన చౌడాపూర్ మండల పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి..చౌడాపూర్ మండలం మరికల్ గ్రామంలో చిన్న మల్లికార్జున్ అనే వ్యక్తి దుకాణ సముదాయంలో గురువారం మధ్యాహ్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి దుకాణానికి వచ్చాడు. అక్కడ దుకాణంలో ఉన్న వ్యక్తి లోపలికి వెళ్లడంతో ఎవరూ లేని విషయాన్ని గమనించి గుర్తుతెలియని వ్యక్తి కౌంటర్ వద్ద పెట్టిన యాపిల్ ఫోన్‌ను తీసుకుని వెళ్లిపోయాడు. ఈ విషయం గురించి బాధిత వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పోక్సో నిందితుడికి పదేళ్ల కఠిన కారాగారం

రూ.30 వేల జరిమానా

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రేమపేరుతో బాలికను మోసం చేసి, వివాహం చేసుకోవడంతో పాటు లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి న్యాయస్థానం పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించిందని ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఎంపీపటేల్ గూడకు చెందిన జంగం నరేందర్ (20) మేస్త్రీ పని చేస్తుండేవాడు. ఇదే గ్రామంలోని ఓ ఇంట్లో పనులు చేస్తుండగా.. బాలిక పరిచమైంది. ప్రేమ పేరుతో ఆమెను అపహరించి, పెళ్లి చేసుకోవడంతో పాటు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయమై 2018లో ఆదిబట్ల పీఎస్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో పోక్సో చట్టం ప్రకారం నరేందర్‌ను దోషిగా నిర్ధారిస్తూ ఎల్బీనగర్‌లోని రంగారెడ్డి జిల్లా ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక న్యాయమూర్తి తీర్పు వెల్లడించారు. నరేందర్‌కు కఠిన కారాగార శిక్షతో పాటు రూ.30 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. బాధితురాలికి రూ.40 లక్షల పరిహారం అందించినట్లు పేర్కొన్నారు. ఈ కేసులో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సునీత, రఘు వాదనలు వినిపించినట్లు సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు.

బీజేపీ పరువునష్టం కేసు వాయిదా

గైర్హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి

సిటీ కోర్టులు : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీజేపీ దాఖలు చేసిన పరువునష్టం కేసుపై గురువారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టు (స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్)లో విచారణ జరిగింది. ఈ కేసు విచారణకు సీఎం రేవంత్‌రెడ్డి గైర్హాజరు కావడంతో న్యాయస్థానం విచారణను ఈనెల 24కు వాయిదా వేసింది. ఈ కేసు విచారణకు ఫిర్యాదుదారుడు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు కూడా గైర్హాజరయ్యారు. ప్రతివాది అయిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ కార్యకలాపాల నేపథ్యంలో కోర్టుకు రాలేకపోయారని ఆయన తరుపు న్యాయవాదులు విశ్వేశ్వర్‌రావు కోర్టుకు సూచిస్తూ పిటిషన్ దాఖలు చేశారు.

టీచర్ పర్స్ పోయిందని..

విద్యార్థిని పరీక్ష రాయనీయని వైనం

కొందుర్గు: పాఠశాలలో ఉపాధ్యాయురాలి పర్స్ పోయిందనే అనుమానంతో.. ఓ విద్యార్థిని వార్షిక పరీక్ష రాయకుండా అడ్డుకున్నారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా కొందుర్గు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో గురువారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. పాఠశాలలో గ్రంథాలయ బాధ్యతలు చూసుకునే ఉపాధ్యాయురాలు స్వాతి పర్స్ మిస్ అయ్యింది. అందులో ట్యాబ్‌లెట్లతో పాటు ఏటీఎం కార్డు, రూ.100 ఉన్నాయని స్వాతి తెలిపారు. అయితే ఈ పర్స్‌ను 9వ తరగతికి చెందిన ఓ విద్యార్థి తీసుకున్నాడనే అనుమానంతో గురువారం ఉదయం జరిగిన వార్షిక పరీక్షను క్లాస్ టీచర్ రాయనీయలేదు. అంతేకాకుండా పర్స్ తీసుకొచ్చాక పరీక్ష రాయాలని ఆదేశించారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో.. ప్రిన్సిపల్ కుర్షీద్ సదరు విద్యార్థిని తన ఎదుట కూర్చోబెట్టుకుని పరీక్ష రాయించారు. ఇదిలా ఉండగా టీచర్ పర్స్ మాత్రం ఎక్కడా దొరకకపోవడం గమనార్హం.



దుద్యాల్ మండలంలో కురుస్తున్న వర్షం



అనంతగిరి: వికారాబాద్‌లో కురిసిన వర్షం



బొంరాస్‌పేట: మహంతీపూర్‌లో వడగండ్ల వాన

గాలివాన బీభత్సం

- కూలిన ఇళ్లు, నెలకొరిగిన చెట్లు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం
- ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలు

అనంతగిరి: వికారాబాద్‌లో గురువారం సాయంత్రం వర్షం కురవడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. మధ్యాహ్నం వరకు ఎండ, సాయంత్రానికి ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. అనంతగిరి పల్లి సమీపంలో రోడ్డుపై ఓ చెట్టు విరిగి పడింది. ఈదురుగాలులు, వర్షంతో కొంతసేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

అన్నాసాగర్‌లో..

బంట్వారం: కోట్‌పల్లి మండలంలోని అన్నాసాగర్‌లో ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. రోడ్డు పక్కన చెట్లు విరిగి పడ్డాయి. అక్కడక్కడ వడగండ్లు పడ్డాయి. ఈదురు గాలులకు ఓగుల్లాపూర్ గేటు దగ్గర రోడ్డుపై చెట్టు విరిగి పడింది. బంటారం మండలంలోని సల్బత్తాపూర్‌లో ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. గ్రామంలో ఇంటి ముందు నిలిపి ఉంచిన ట్రాక్టర్‌పై పెద్ద చెట్టు విరిగి పడింది.

తాండూరు, పెద్దేముల్‌లో..

తాండూరు రూరల్: పెద్దేముల్ మండలంలోని పెద్దేముల్ తండా, గాజీపూర్, పెద్దేముల్, బుద్ధారం, కొండాపూర్, మంబాపూర్ గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం పడింది. పలు గ్రామాల్లో వడగండ్లతో కూడిన వాన పడింది. ఈదురు గాలులు ఒక్కసారిగా రావడంతో మామిడి తోటలోని మామిడికాయలు నెలరాలాయి. కొన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పెద్దేముల్ మండలం కొండాపూర్ సమీపంలోని నేళ్లగడ్డ తండాలో బుజ్జిబాయి ఇంటిపై కప్పు రేకులు లేచి పోయాయి.అక్కడక్కడ చెట్లు నెలకొరిగాయి.పెద్ద ఎత్తున ఈదురు గాలులతో వీచడంతో ప్రజలు భయందోళనకు గురయ్యారు.



రోడ్డుపై పడిన విద్యుత్ స్తంభం

దుద్యాల్‌లో..

దుద్యాల్: హస్నాబాద్, ఆలేడ్, దుద్యాల్, కుదురుమల్ల తదితర గ్రామాల్లో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం జోరుగా కురిసింది. వర్షం కురుస్తున్న సమయంలో ఈదురు గాలులు వేగంగా వీచాయి. ఏకంగా గంట సమయం వరకు వర్షం కురిసింది. హస్నాబాద్ గ్రామంలో కురిసిన భారీ వర్షానికి మౌలాలి అనే వ్యక్తి ఇంట్లోకి వర్షం నీరు చేరింది. ఏదిఏమైనా అకాల వర్షాలు రైతులను, ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని వారు చెబుతున్నారు.

బొంరాస్‌పేటలో..

బొంరాస్‌పేట: మండల పరిధిలోని మహంతీపూర్, జానకంపల్లి పరిసర ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వాన కురిసింది. పలు చోట్ల వరిపంట నేలరాలడంతో పలువురు రైతులు ఆందోళన చెందారు.

పిడుగుపాటుకు 20గొర్రెలు మృతి

బొంరాస్‌పేట: మండల పరిధిలోని బుర్రితండా పంచాయతీ పరిధిలోని మైసమ్మగడ్డ తండాలో పిడుగుపాటుకు గురువారం సాయంత్రం 20 గొర్రెలు మృతి చెందాయి. వివరాలు ఇలా ఉన్నాయి..తండాకు చెందిన పీక్లా నాయక్ 50గొర్రెలను మేపుతుండగా ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడింది. దీంతో అక్కడ హఠాత్తుగా పిడుగు పడి 15 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. అనంతరం కొద్దిసేపటికే 5గొర్రెలు మృతి చెందినట్లు బాధితుడు వాపోయాడు. వాటి విలువ సుమారు రూ.2లక్షల వరకు ఉంటుందని పీక్లా నాయక్ బోరున విలపించాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని మొరపెట్టుకున్నారు.



అల్లాపూర్‌లో వడగండ్ల వాన

ధారూరు మండలంలో..

ధారూరు: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఒక్కసారిగా గాలిదుమారం చెలరేగింది. వడగండ్ల వాన పడింది. దీంతో చేతికొచ్చిన పంటలు దెబ్బతిన్నాయి. నాగసమందర్, అల్లాపూర్, హరిదాస్‌పల్లి, కొండాపూర్ కలాన్, కుక్కింద, గడ్డమీది గంగారం, రుద్రారం, మైలారం, నాగారం తదితర గ్రామాల్లో గాలి తీవ్రతకు చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ప్రస్తుతం వరి పంట కోత దశలో ఉండటంతో నష్టం వాటిల్లింది. మొక్కజొన్న, పసుపు, జొన్న, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. విద్యుత్ స్తంభాలు, వైర్లు పడిపోవడంతో కరెంట్ సరఫరా నిలిచిపోయింది. నాగసమందర్ ప్రధాన రోడ్డుపై నాలుగు విద్యుత్ స్తంభాలు పడ్డాయి. ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.



దుద్యాల్: హస్నాబాద్‌లో ఓ ఇంట్లోకి చేరిన వర్షపు నీరు

ఈదురు గాలులతో వర్షం..

తాండూరు టౌన్: పట్టణంలో గంట పాటు ఈదురు గాలతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది.. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో జనం జీవనం స్తంభించింది.. భద్రప్ప జాతర ఉత్సవాలకు ఏర్పాటుచేసిన ఇంద్ర చౌక్ సమీపంలోని కర్రల తోరణం విరిగిపడింది దీంతో పెను ప్రమాదమే తప్పింది. రాజీవ్ కాలనీలో చెట్టు కూలిపోయింది.. సాయిపూర్ శాంతినగర్‌లో రోడ్లు జలమయ్యాయి. శాంతినగర్‌లో పలు వాహనాలు వరద నీటిలో చిక్కుకున్నాయి.



తాండూరు టౌన్: శాంతినగర్‌లో వరదనీటిలో చిక్కుకున్న ఆటో



తాండూరు టౌన్: ఆర్టీసీ బస్టాండ్‌లో విరిగి పడిన బోర్డు



సాయిపూర్‌లో జలమయమైన రోడ్డు



ధారూరు: ధారూరులో కురుస్తున్న వాన

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

మొయినాబాద్: ఇంట్లోనే ఉరి వేసుకుని ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాగిరెడ్డిగూడలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గొర్రెల వెంకటస్వామికి పదేళ్ల క్రితం మొదటి భార్య మరణించడంతో జయమ్మ(40)ని రెండో వివాహం చేసుకున్నాడు. మొదటి భార్యకు ముగ్గురు కొడుకులు, రెండో భార్యకు ఒక కూతురు. మొదటి భార్య పెద్ద కొడుకు ఆరు నెలల క్రితం మృతి చెందాడు. కాగా గురువారం వెంకటస్వామి పనికి వెళ్లగా జయమ్మ ఇంటి వద్దనే ఉంది. తన తోపాటు ఉన్న కూతురిని బయటకు పంపించి ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అయితే ఆమె ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు

ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: రాష్ట్రంలోని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో గురువారం నియోజకవర్గంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులతో సన్నాహాక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో అర్హులైన పేదలకు పారదర్శకంగా ఇళ్లు పంపిణీ చేయాలని కమిటీ సభ్యులకు సూచించారు. పార్టీలకు అతీతంగా ఎంపిక చేయాలన్నారు. ఎలాంటి అవకతవకలు లేకుండా లబ్ధిదారుల ఖాతాలో డబ్బులు పడుతాయని చెప్పారు. నిబంధనల ప్రకారం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కమిటీ సూచించిన జాబితా ప్రకారం ఇళ్లు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలకు సంబంధించి 3700ల ఇళ్లు మంజూరయ్యాయని, ఒక్కో మండలానికి 700లకు పైగా ఇళ్లు అందుతాయన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మధుసుదన్‌రెడ్డి, ఆర్టీఓ చంద్రకళ, ఐదు మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, కార్యదర్శులు, మున్సిపల్ అధికారులు, ఇందిరమ్మ కమిటీల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవ విగ్రహానికి పల్లకీ సేవ

వైభవంగా భద్రేశ్వరుని పల్లకీ సేవ

తాండూరు టౌన్: తాండూరు పట్టణంలోని ప్రసిద్ధ క్షేత్రమైన శ్రీ భావిగి భద్రేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని బుధవారం రాత్రి స్వామి వారి పల్లకీ సేవ ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో భక్తుల సందోహం నడుమ ఘనంగా ఊరేగించారు. డప్పు వాయిద్యాలు, మంత్రోచ్ఛరణ, బాణాసంచా, సంప్రదాయ నృత్యాలు, పలు రకాల వేషధారణలతో పల్లకీ సేవను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు ఊరేగింపులో పాల్గొన్నారు.



బాణాసంచా పేల్చి సంబరాలు

జాతీయ రహదారిపై కూలిన చెట్టు

భారీగా ట్రాఫిక్ జాం

చేవెళ్ల: ఈదురుగాలులతో కూడిన వర్షానికి హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై మర్రిచెట్టు కూలి రాకపోకలకు అంతరాయం కలిగింది. గురువారం సాయంత్రం 4 గంటల సమయంలో పెద్ద ఎత్తున ఈదురుగాలులు వీచడంతో మండలంలోని మీర్జాపూర్ సమీపంలో జాతీయ రహదారి పక్కన ఉన్న పెద్ద మర్రిచెట్టు కూలింది. ఆ సమయంలో రోడ్డుపై వాహనాలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. చెట్టు రోడ్డుకు అడ్డంగా పడడంతో ఇరువైపులా కిలోమీటర్‌కుపైగా వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమాచారం అందుకున్న చేవెళ్ల ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి జేసీబీ సాయంతో చెట్టును తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.



మర్రిచెట్టు కూలడంతో రోడ్డుపై నిలిచిపోయిన వాహనాలు

గస్తీ ముమ్మరం

- పహాడీషరీఫ్‌లో కార్డన్ సెర్చ్
- పర్యవేక్షించిన డీసీపీ సునీతారెడ్డి

పహాడీషరీఫ్: పక్షం రోజులుగా పాతబస్తీతో పాటు శివారు ప్రాంతాలలో నేరాలు పెచ్చుమీరుతుండడంతో రాచకొండ కమిషనరేట్ పోలీసులు అప్రమత్తమయ్యారు. ఇందులో భాగంగా మహేశ్వరం డీసీపీ డి.సునీతారెడ్డి పర్యవేక్షణలో పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉమర్ కాలనీలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. 200 మంది పోలీసులు గ్రూప్‌లుగా ఏర్పడి కాలనీకి వచ్చి, పోయే మార్గాలను మూసి సోదాలు నిర్వహించారు. ఇందులో సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 70 బైక్‌లు, ఏడు ఆటోలతో పాటు 39 లీటర్ల అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఐదు మంది రౌడీషీటర్లు, ముగ్గురు సస్పెక్ట్ షీటర్లను అదుపులోకి తీసుకొని నేరాలకు పాల్పడొద్దని డీసీపీ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా మహిళలతో మమేకమైన ఆమె ఎలాంటి ఇబ్బందులున్నా పోలీసులకు సమాచారం ఇవ్వాలని అభయమిచ్చారు. ఈ సోదాలలో అదనపు డీసీపీ సత్యనారాయణ, మహేశ్వరం ఏసీపీ పి.లక్ష్మీకాంత రెడ్డి, పహాడీషరీఫ్, బాలాపూర్ ఇన్‌స్పెక్టర్లు గురువారెడ్డి, సుధాకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బస్తీలో మహిళల సమస్యలు తెలుసుకుంటున్న డీసీపీ సునీతారెడ్డి

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



వెంకటయ్య (ఫైల్)

చేవెళ్ల: సొంతూరుకు వెళ్తానని బయలుదేరిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షాబాద్ మండలం మక్తగూడ గ్రామానికి చెందిన బుత్తుల వెంకటయ్య తన కుటుంబ సభ్యులతో కలిసి కొంత కాలంగా చేవెళ్లలో నివాసముంటున్నాడు. కాగా ఈ నెల 15న ఉదయం 8 గంటల సమయంలో సొంతూరు మక్తగూడకు వెళ్తానని ఇంటి నుంచి బయలుదేరి వెళ్లాడు. తరువాత అతని భార్య శ్రీలత ఫోన్ చేస్తే అతని ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. మక్తగూడకు వెళ్లి ఉండవచ్చని భావించి బుధవారం రాత్రి శ్రీలత తన అత్తకు ఫోన్ చేసింది. ఆయన అక్కడికి వెళ్లలేదని తెలిసి గురువారం చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

హీమోఫిలియా నిర్మూలనకు కృషి

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయలక్ష్మి



ర్యాలీని ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయలక్ష్మి

షాద్‌నగర్: ప్రతిఒక్కరూ హీమోఫిలియా నిర్మూలనకు కృషి చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయలక్ష్మి అన్నారు. గురువారం ప్రపంచ హెమోఫిలియా దినోత్సవాన్ని పురస్కరించుకొని చించోడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ స్రవంతి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ... హీమోఫిలియా అనేది వంశపారపర్యంగా వస్తుందని, ఇది రక్తం గడ్డకట్టే సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తుందని అన్నారు. మగవారిలో చిన్నచిన్న గాయాలై రక్తస్రావం కారణంగా మరణానికి కారణం అవుతాయని చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు జగదీష్, సంధ్య, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, డీపీఎంఓ వెంకటేశ్వర్లు, హెల్త్ సూపర్‌వైజర్లు చంద్రకళ, శ్రీరామ, అమృత, ల్యాబ్ టెక్నీషియన్ శివ, గౌస్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు. పట్టణ సమీపంలోని గిరిజన గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ చైర్మన్ డాక్టర్ సీతాపోలే ఆధ్వర్యంలో ప్రపంచ హెమోఫిలియా దినోత్సవాన్ని నిర్వహించారు.



చెట్టుకింద సేద తీరుతున్న మహిళలు

ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి!

భానుడి ప్రతాపంతో రోజురోజుకి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ప్రజలు ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరవుతున్నారు. ఇంట్లో ఉంటే ఉక్కపోతగా ఉంటోందని కొందరు చెట్ల నీడను ఆశ్రయిస్తున్నారు. ఇదిలా ఉండగా.. ఎండలో పని చేయడానికి కూలీలు సైతం జంకుతున్నారు. అందుకే పని చేసే చోట పెద్దపెద్ద గొడుగులు ఏర్పాటు చేసుకుని ఎండ నుంచి కొంత ఉపశమనం పొందుతున్నారు. మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామంలో కూలీలు గొడుగు ఏర్పాటు చేసుకుని ఓ ఇంటి నిర్మాణానికి గుంతను తీస్తున్నారు. మరో వైపు మహిళలు ఎండ తీవ్రతను చెట్ల కింద సేదతీరుతున్నారు. – దుద్యాల్



గొడుగు ఏర్పాటు చేసుకుని పని చేస్తున్న కూలీలు

వామ్మో.. మురుగు!

- ఇళ్ల మధ్య చేరిన నీరు
- విజృంభిస్తున్న దోమలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న కాలనీ వాసులు
- పట్టించుకోని అధికారులు

దుద్యాల్: మండల కేంద్రంలోని పదోవార్డులో ఇళ్ల మధ్య మురుగునీరు చేరి దుర్వాసన వెదజల్లుతుందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రోజులుగా ఇళ్ల మధ్య మురుగునీరు చేరడంతో అక్కడ దోమలు విజృంభిస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రయితే చాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, నిద్రకు దూరమవుతున్నామని చెబుతున్నారు. ఈ విషయంలో అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసులు డిమాండ్ చేస్తునారు.



పదో వార్డులో ఇళ్ల మధ్య చేరిన మురుగు నీరు